



పరేష్ ఎన్. దోషి

పన్నెండంతస్తుల భవనం అది.

ఆ బిల్డింగ్ నిండా ఆఫీసులే.

మొదటి అయిదంతస్తులలో ప్రైవేటు షాపులూ, ఆఫీసులూ వున్నాయి. ఆ పైని ఏడంతస్తులలోనూ టాక్స్ ఆఫీసు, లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీసులాంటి గవర్న మెంట్ ఆఫీసులున్నాయి.

గ్రౌండ్‌ఫ్లోర్‌లో మాత్రం మంచి రెస్టారెంట్ వుంది.

ప్రైవేట్ ఆఫీసులు ఒకదానికి ఒకటి పోలిక లేకుండా వుంటే, గవర్నమెంట్ ఆఫీసులన్నీ ఒకేలా, ఒకే రంగు గోడలతో వున్నాయి.

అయినా చూట్టానికి అందంగానే వున్నదా యూనిఫార్మిటీ.

పదిగంటల సమయం.

ఎండ బాగానే వుంది!

ఒక ముసలామె పట్టిన చెమటను తుడుచుకుంటూ, దీర్ఘంగా ఊపిరి వదుల్తూ, లోపలికి నడిచింది. ఆమె ముఖంలో ముడతలు పడివున్నాయి. జుట్టు నెరిసి పోయి వుంది. అరవైఏళ్ళ వయసు వుంటుందామెకు. ఆకుపచ్చరంగులో నేత చీర కట్టుకొని వుందామె. నడవలేక నడుస్తోంది!

ఆమె చేతిలో ఒక సంచి వుంది!

ఆ సంచిలో ఏవో కాగితాలున్నాయి.

తను ఏ ఆఫీసుకు వెళ్ళాల్సిందీ, అదెక్కడున్నదీ తెలుసుకొని యిక్కడికి వచ్చింది.

పదవ అంతస్తులోవున్న ఆఫీసుకు వెళ్ళాలి తను.

మెల్లిగా నడుచుకొంటూ లోపలి కెళ్ళిందామె.

ఎండలోంచి నీడలోకి వచ్చిందేమో!

క్షణకాలం వూపిరి పీల్చుకోవడానికి నిలబడింది.

తర్వాత లిఫ్ట్ దగ్గరకు వెళ్ళిందామె.

లిఫ్ట్ పక్కనే స్టెయిర్ కేస్ వుంది.

మనుషులు మెట్లెక్కి వెళ్ళిపోతు న్నారు.కొంతమంది మెట్లు దిగుతున్నారు.

ఆమె లిఫ్ట్‌ముందు నిలబడింది.

లిఫ్ట్ తలుపుకు ఒక బోర్డు వేలాడుతూ వుంది.

ఆమెకు చదువు రాదు. ఆ బోర్డ్‌లో ఏం వ్రాసుందో ఆమెకు తెలీదు.

'లిఫ్ట్ అండర్ రిపేర్' అని వ్రాసుందా బోర్డులో.

ఒకతను అటు వచ్చి, "లిఫ్ట్ పని చెయ్యట్లేదమ్మా, మెట్లెక్కి వెళ్ళా ల్సిందే!" అన్నాడు.

తీసూర్చరు మనిపించిందామెకు.

ఆమెను చూసి అతనికే జాలివేసింది.

"ఏం పనమ్మా నీకు? ఎక్కడికి వెళ్ళాలి?"

"పదవ అంతస్తులోని ఆఫీసుకెళ్ళాలి బాబూ! వారు ఒంటరిదాన్నిచేసి పోయారు. పెంషను డబ్బులకోసం..."

"పిల్లలు లేరా?"

"నాకు ఆ భాగ్యం కలగచెయ్యలేదు ఆ దేవుడు! ఉంకెన్నాళ్ళు నా జీవితం? పిల్లలు లేకపోయారనే దిగులుతోనే పోతాను? కాటికి కాళ్ళు చాపుకున్నదాన్ని మరి..."

అతనికి ఆలస్యమవుతుందని కలవు తీసుకొని వెళ్ళిపోయాడతను.

ఇక చేసేదిలేక ఆ ముసలామె ఒక్కొక్క మెట్టే ఎక్కసాగింది!

నాలుగు అంతస్తుల మెట్లు ఎక్కేసరికే ఆమెకు శోష వచ్చినంత పనైంది! కాని ఆమెకు భవిష్యత్తులో దృష్టి వుంది. లేని శక్తిని కూడదీసుకొని ఒక్కొక్క మెట్టే ఎక్కసాగింది.

అరగంట తర్వాత ఆమె పదవ అంతస్తుకు చేరుకోగలిగింది. గవర్న మెంట్ ఆఫీసులన్నీ ప్రశాంతంగా వున్నాయి.

పెద్ద హాలు! దేదీప్యమానంగా వెలుగు తున్న మెర్క్యురీ లైట్లు!

ఆమె లోపలకు నడిచింది.

ఆఫీసులో ఒక్క మనిషీ లేడు!

ఒక్కొక్క కౌంటర్‌లో ఒక్కొక్క కంప్యూటర్ వుంది.

ఆమెకు అంతా విచిత్రంగా వుంది.

ఎవరూ లేరే ఇక్కడ?

ఎవర్నడగాలి? ఏం చెయ్యాలి?

ఆమె ఒక్కొక్క కౌంటర్ దగ్గరే నిలబడింది.

ఆ కంప్యూటర్‌లు ఆమెను వెక్కి రిస్తున్నట్లుగా తోచాయి.




ఆ నిశ్శబ్దం ఆమె మెదడును చీల్చేస్తుందేమోనని భయం వేసిందామెకు.

గొంతు ఎండిపోయింది.

దాహమైంది ఆమెకు.

"యిక్కడ ఎవరూ లేరా?" అంది ఆమె ఒక కంప్యూటర్ ముందు నిలబడి. గదిలో యింకెవరూ లేకపోవడం వలన గోడల మధ్య ఆమె మాటలు ప్రతిధ్వనించాయి.

ఆమె ఒక బెంచీమీద కూలబడింది.

పదినిముషాలు గడిచాయి.

ఆ గదిలోని వాతావరణానికి కొస్త అలవాటు పడిందామె.

రాబోయే రోజుల్లో వస్తుఉండాల్సి వస్తుందా? లేక యిదివరకటిలాగానే సాఫీగా గడిచిపోతుందా? అకస్మాత్తుగా ఆమె ఒంటరితనం ఫీలవసాగింది.

ఆమెకు పిల్లలు పుట్టరని డాక్టర్లు తేల్చి చెప్పినప్పుడు - తన ముప్ఫయి రెండవ ఏట తను ఒక అబ్బాయిని పెంచుకుంది. ఆమె అతడిని అల్లారు ముద్దుగా పెంచింది. బహుశా అలా గారాం చెయ్యాల్సింది కాదేమో! ఆ కుర్రవాడు పెద్దవుతున్నకొద్దీ చెడ్డ అలవాట్లు చేసుకున్నాడు. చెడ్డవాళ్ళ సావాసం అతడిని అట్లా మార్చిందేమో! అల్లరి చెయ్యడం, సిగరెట్లు తాగడం అతనికి మామూలు అయిపోయింది. దొంగతనం

కూడా అలవాటయ్యింది. ఒకరోజున అతను యిల్లు విడిచి పారిపోయాడు. ఆ తర్వాత మళ్ళీ కనబడలేదు.

ఆమెకు తను పెంచుకున్న కొడుకు గుర్తుకువచ్చాడు! తనకు ఆపాటి అదృష్టం కూడా లేదేమో!

ఆమె మరొకసారి ఆ కంప్యూటర్లను చూసింది. ఒకో కంప్యూటర్‌కు రకరకాల మీటలున్నాయి. ఈ మీటలు నొక్కితే పనేమన్నా జరుగు తుందేమో!

కాని ఏ మీట నొక్కాలి?

ఆమె వరుసగా అన్ని మీటలు నొక్కింది. రకరకాల శబ్దాలు వచ్చాయి.

అంతే!

మీటలు నొక్కి నొక్కి అలిసి పోయింది.

అన్ని కంప్యూటర్లలోనూ అన్ని మీటలూ నొక్కింది. కాని ఫలితంలేదు.

ఆమెకు ఏడుపొచ్చింది.

మరల బెంచీమీద కూలబడింది.

కడుపులో ఎలుకలు పరుగెడుతు న్నాయి. ఆకలిగా వుంది. ముసలి ప్రాణం ఎంతసేపు తట్టుకోగలదు?

కాలం గడిచిపోతూ వుంది. ఆమెకు కునుకు పట్టింది. క్రమంగా మనుషులు లోపలికి రాసాగారు!

వాళ్ళు చదువుకున్నవాళ్ళు. అన్నీ తెలిసిన మనుషులు. ఏవో కాగితాలను కంప్యూటర్లకు ఫీడ్ చేసి, ఏవో మీటలు నొక్కి, చకచకా తమ పని కానిచ్చు కొని వెళ్ళిపోతున్నారు.

ఎవరి దృష్టి ఆమెమీద పడలేదు.

మిట్టమధ్యాహ్నమైంది.

ఆమెకు మెలకువ వచ్చింది.

ఇందాకటిలాగే ఇప్పుడూ నిశ్శబ్దంగా వుంది. కాని ఏదో మార్పు కనిపిస్తోంది!

ఆమె కళ్ళ ఎదుట భవిష్యత్కాలపు వస్తుల రాత్రులు కదులుతున్నాయి.

ఆమె దృష్టి కౌంటర్ల మీద పడింది.

ఆమె ముఖంలో ఆశ్చర్యం అంకిత మైంది. కళ్ళల్లో ఆశ తళుక్కుమని మెరి సింది. శరీరాంగాల్లో నూతనోత్సాహం ప్రవహించింది!

కారణం...

ప్రతి కౌంటర్‌లోనూ మనుషులు వున్నారు.

కంప్యూటర్లు ఎలా మాయమయ్యాయో మాయమయ్యాయి!

ఆ స్థానే మనుషులున్నారిప్పుడు!

ఆ కంప్యూటర్లకు మెదడు వుండ వచ్చేమోగాని, హృదయముండదు. యీ మనుషులు హృదయమున్న మనుషులు.

ఆ ఆలోచనే ఆమె కళ్ళల్లో ఆశను తళుక్కుమనేలా చేసింది.

ఈ ఆలోచనే అమె అంగాంగాల్లో నూతనోత్సాహాన్ని ప్రవహింపచేసింది!

ఆమె ఒంటిలోని సత్తువనంతా కూడ దీసుకుని లేచింది. మెల్లగా అడుగులేసు కుంటూ ఒక కౌంటర్ ముందు నిలబడింది.

"బాబూ!"

అతని నుంచి జవాబు లేదు.

అతను కనీసం తలెత్తి చూడనూ లేదు.

ఆమె మరోసారి పిలిచింది.

ఏమిటన్నట్లు కోపంగా చూశాడతను.

ఆమె సంచిలోంచి కాగితాలు తీసి అందించింది.

అవి చూసి "యిక్కడ కాదు, అటు చివరకు పో" అన్నాడు.

ఆమె చివరి కౌంటర్ కెళ్ళింది.

పిలిచిన పావుగంటకి పలికినతని జవాబు యిది- "ఇక్కడెవరు చెప్పారమ్మా వెళ్ళమని? ఇక్కడ కాదు-అటు నుంచి మూడవ కౌంటరు."

ఆమె అటునుంచి మూడవ కౌంటరు కెళ్ళింది.

అలా ఆమె ఆ గదిలోని కౌంటర్లన్నీ తిరిగివచ్చింది. అటునుంచి మూడవ కౌంటరుకు రెండవసారి వెళ్ళగా- "అటు చివరి కౌంటరు కెళ్ళమ్మా!" అని విసుక్కున్నాడతను.

చివరిసారిగా అటు చివరి కౌంటరు కెళ్ళిందామె.

కాగితాలను విసురుగా, విసుగ్గా అందుకొని, ఒకమారు చదివి, "మీ ఆయన చచ్చాడా?" అన్నాడతను సంస్కారవంతుడు.

"వెల్లాళ్ళయ్యింది బాబూ!"

"ఎలా నమ్మటం? డెత్ సర్టిఫికేట్ ఏది?"

"అదేంటి బాబూ?"

"చనిపోయినట్లు సర్టిఫికేటు?"

"నేను చెబితే చాలదా...?"

"వెళ్ళమ్మా వెళ్ళు, ఏమీ లేకుండా వచ్చావు! పో..." విసుక్కున్నాడతను.

ఆమె కళ్ళల్లోంచి జలజలా నీళ్ళు రాలాయి. నాలుకతో బుగ్గలను తడిమింది ఆ కన్నీళ్ళకోసం.

నిరాశగా బయటికి వచ్చిందామె.

ఆమెకు ఎవరిమీదా కోపంగా లేదు. కనీసం ఆ దేవుడిమీదైనా లేదు! తన ఖర్మకు ఏడ్చిందామె. అంతే! అంతకంటే ఎక్కువ ఆలోచించగల నేర్పు, తెలివి తేటలూ లేవు ఆమెకు.

నెమ్మదిగా బయటికి వచ్చింది.

రెండు రోజుల్నుంచీ ఏమీ తినలేదేమో నీరసంగా వుంది!

పదంతస్తులు దిగాలంటే ఆమెకు తారెత్తింది.

ఒక్కో మెట్టే దిగసాగింది. తప్పదు కాబట్టి!

ఆరంతస్తులు దిగిన తర్వాత-

యింకేమాత్రం ఓపిక మిగలలేదు ఆమెలో.

అయినా మొండిగా దిగసాగింది.

నాలుగు మెట్లు దిగిందో లేదో-

ఆమెకు కళ్ళు తిరగసాగాయి!

అక్కడే కూలిపోయిందామె!! •